క్లుప్తంగా

గుంతల సమస్య పరిష్కారం



రోడ్డుపై వేసిన గ్రావెల్

ఏర్పేడు: మండలంలోని ఇసుకతాగేలిలో ఆదివారం రోడ్డుపై గ్రావెల్ వేశారు. తిరుపతి–శ్రీకాళహస్తి ప్రధాన రహదారి నుంచి ఇసుకతాగేలి వరకు ఒకటిన్నర కిలోమీటర్ మేరకు మట్టి రోడ్డు ఉంది. రోడ్డు గుంతలమయంగా మారడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, విద్యార్థులు కాలినడకన వెళ్లలేక ఇబ్బందులు పడుతుండేవారు. గ్రామస్తుల విన్నపం మేరకు సర్పంచ్ గురవమ్మ రోడ్డుకు గ్రావెల్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు.

పాలేటమ్మకు ప్రత్యేక పూజలు



అలంకరణలో పాలేటమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పెద్ద పాలేడు గ్రామదేవత గంగమ్మకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి విగ్రహానికి అభిషేకాలు చేశారు. పొంగళ్లు, అంబలి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం పొందిన ఉపాధ్యాయులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని పొయ్యి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బదిలీ కావడంతో వారికి విద్యార్థుల తల్లిదండ్రులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవ నాయుడు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విజయ్ కుమార్, తులసి దాస్ ఎనిమిదేళ్ల పాటు పిల్లలకి క్రమశిక్షణ, మంచి బోధన అందించారని తెలిపారు. వారు బదిలీ కావడం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రయ్య, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

21న డైనమిక్ యోగా



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని పూజిత బాలికల జూనియర్ కళాశాలలో సహజ సంపద, డైనమిక్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ నెల 21వ తేదీ డైనమిక్ యోగా, మ్యూజిక్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ సభ్యులు బొప్పన శ్రీనివాస్, నాగప్రసాద్, మాడస్వామి, రామసుబ్బయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం బుచ్చినాయుడుకండ్రిగలో కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రపంచ సంగీత, యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శిల్పారామం.. కళావైభవం



తిరుచానూరు (చంద్రగిరి) : తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం సాంస్కృతిక వైభవం వెల్లివిరిసింది. నెల్లూరుకు చెందిన శ్రీనటరాజ కళాక్షేత్రం గురువు త్రిపుర నిఖిత పర్యవేక్షణలో కళాకారులు ప్రదర్శించిన భరతనాట్యం అలరించింది. నృత్యలహరిలో భాగంగా మహదేవ సుతం, కంటి అఖిలాండ, బ్రహ్మముక్కటే, జయలక్ష్మి, చక్కని తల్లికి, ఇదిగో భద్రాద్రి, శంభో స్వయంభో, చిన్ని శిశువు, దశవతారాలు, దేవదేవం భజే, రామభజన, మంగళం తదితర కీర్తనలు, గీతాలకు కళాకారులు అశ్రిత, గీతా కృష్ణ, హర్షర కృష్ణ, జ్ఞాన హర్షిత, లిఖిల సాహితి, పల్లవి, జైశ్వీ, తపస్విని హావభావాలు, అభినయం ఆకట్టుకుంది. ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో శిల్పారామ ప్రాంగణం మార్మోగింది. అనంతరం కళాకారులను ఏఓ ఖాదర్‌వలీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. రాధాకృష్ణ, పప్పీ, వరప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.

సేవాలయాలు

- సచివాలయ వ్యవస్థతో గడప గడపకూ ప్రభుత్వ పథకాలు
- ప్రతి సమస్యకు గడువులోపు పరిష్కారం
- మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే సేవలు
- కష్టాలు తప్పాయని గ్రామీణుల ఆనందం

బీఎన్‌కండ్రిగ మండలంలో..

సచివాలయాలు	-	14
జనాభా	-	33678
అందుతున్న సేవలు	-	500
సెక్రటరీలు	-	99
గ్రామ వలంటీర్లు	-	203



బుచ్చినాయుడుకండ్రిగ సచివాలయం



సచివాలయంలో ఆధార్ సేవలు

మైళ్లకొద్దీ దూరంలో అందుబాటులో లేని కార్యాలయాలు.. నెలలపాటు తమకు కావాల్సిన ధృవీకరణ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు.. లబ్ధిదారుడు వెళ్లినా అందుబాటులో లేని అధికారులు.. తమ పనులు ఆపుకుని కార్యాలయాల చుట్టూ వ్యయప్రయాసలు కోర్చి ప్రదక్షిణలు చేసినా ఫలితం శూన్యం. ఇదంతా గతం. వీటన్నింటికి ముగింపు పలుకుతూ పంచాయతీల్లోనే జగనన్న ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి పునాదులు వేసింది. ఫలితంగా ఇంటి ముంగిటకే అన్ని రకాల సేవలు అందుతున్నాయి.

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలందించాలన్న సత్సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ సత్ఫలితాలనిస్తోంది. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సచివాలయ వ్యవస్థ ద్వారా సాకారమైంది. ప్రజలు సులభతరంగా ప్రభుత్వ సేవలు అందుకుంటున్నారు. కీలకమైన రెవెన్యూ సేవలతో పాటు జనన, మరణ ధ్రువీకరణ పత్రాల మంజూరు, పన్నుల చెల్లింపులు, సంక్షేమ పథకాల అమలులో సిబ్బంది క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని వలంటీర్లు క్షేత్రస్థాయిలో కార్యదర్శులకు సహాయంగా నిలుస్తున్నారు.

సేవా కేంద్రాలుగా సచివాలయాలు

బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో 2 వేల జనాభాకు ఒకటి చొప్పున 14 సచివాలయాలను ఏర్పాటు చేశారు. ఒక్కో సచివాలయంలో వివిధ శాఖలకు సంబంధించి 10 నుంచి 12 మంది కార్యదర్శులు ఉన్నారు. సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా వ్యవహరిస్తుంటారు. భూ సమస్యల పరిష్కారానికి వీఆర్వో, సర్వేయర్లను నియమించడంతో రైతుకు సత్వర న్యాయం జరుగుతోంది. సచివాలయాల్లో 500 సేవలకు సంబంధించిన ఆన్‌లైన్ పనులను డిజిటల్ అసిస్టెంట్ అందిస్తుండడంతో ప్రజలకు వ్యయప్రయాసలు తగ్గాయి. వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ వలంటీర్ల ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పనిముట్లు అందించడానికి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లను నియమించడంతో వ్యవసాయం సులభతరమైంది. పశువులకు వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎప్పటికప్పుడు పాడి రైతులకు తెలియజేసేందుకు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ నిమగ్నమై ఉంటారు. నాడు–నేడు పనులు, గ్రామ అభివృద్ధి పనులతో పాటు జగనన్న ఇళ్లనిర్మాణాలను వేగవంతం చేయడానికి ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, శాంతిభద్రతలు, విద్యుత్ సమస్యలు తీర్చడానికి మహిళా పోలీస్, ఎనర్జీ అసిస్టెంట్‌లను ఏర్పాటు చేయడంతో ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలన వచ్చింది. ప్రజలు అర్జీ పెట్టుకున్న 72 గంటల్లోనే వాటిని పరిష్కరిస్తున్నారు.

వలంటీర్లు అన్నీ తామై

ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్ ఏర్పాటు కావడంతో ఎలాంటి అవినీతికి తావు లేకుండా అవసరమైన అన్నీ సేవలను అందిస్తున్నారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ తమకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందలేదని బాధపడే సమస్యను తీర్చారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా వ్యవహరిస్తున్నారు. ప్రజల ఇంటి ముంగిటే ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నారు.

ఆర్థిక భరోసా కల్పించింది



నేను వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాను. అయితే ఆరోగ్యం క్షీణించి డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూలి పనులకు వెళ్లలేకపోయాను. నా పరిస్థితిని గుర్తించిన వలంటీర్ నా వివరాలు సేకరించి, సచివాలయంలో తెలపడంతో నాకు ప్రతి నెలా రూ. 10 వేలు పింఛన్ మంజూరైంది. అంతే కాకుండా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఈ ప్రభుత్వం నా కుటుంబానికి ఆర్థికంగా కొండంత అండగా ఉంది. –గోపాలయ్య, కనమనంబేడు

సేవలు బాగున్నాయి



సచివాలయాల సేవలు చాలా బాగున్నాయి. ప్రత్యేకించి మహిళలకు ఎంతో అనుకూలంగా ఉన్నాయి. గ్రామంలోనే ఉన్నందున సులువుగా సచివాలయానికి వెళ్లగలుగుతున్నాం. సమస్యలనూ పరిష్కరించుకుంటున్నాం. స్త్రీనిధి, వైఎస్సార్ సున్నా వడ్డీ, చేయూత, ఆసరా, తదితర పథకాలు మహిళల అభివృద్ధికి తోడ్పడుతున్నాయి. –ప్రియా, గాజులపెళ్లూరు

ఇంటి వద్దకు పథకాలు



ప్రభుత్వ పథకాలు వలంటీర్ ద్వారా ఇంటి వద్దే అందుతున్నాయి. గతంలో సర్టిఫికెట్ల కోసం మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేది. ఇప్పుడు గ్రామంలోని సచివాలయం ద్వారా ఇంటి ముంగిటకే సర్టిఫికెట్లు వస్తున్నాయి. –మునిరత్నంనాయుడు, వేణుగోపాలపురం

వైద్య శిబిరానికి స్పందన



గుంటకిందపల్లిలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం గుంటకిందపల్లి పంచాయతీ పరిధిలోని ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కు వద్ద ఎమ్మెస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రజలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు నాగలక్ష్మి మాట్లాడుతూ.. వైద్య శిబిరంలో 100 మందికిపైగా వైద్య సేవలు అందించామన్నారు. అదే విధంగా అన్ని రకాల ఇన్సూరెన్సు, ఈఎస్ఐ కార్డుదారులకు ఉచితంగా చికిత్స చేస్తున్నామని తెలిపారు.

గంగజాతరకు చాటింపు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పానగల్ గంగమ్మ జాతరకు ఆదివారం చాటింపు వేశారు. ఈ నెల 21వ తేదీ జాతర నిర్వహించనున్నారు. బుధవారం వేకువజామున అమ్మవారి ఉత్సవమూర్తి ఊరేగింపు, రాత్రి నిమజ్జనంతో జాతర ముగియనుంది.

64 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

సత్యవేడు: మండలంలోని ఇరుగుళం పంచాయతీలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించిందని సర్పంచ్ శేఖర్ తెలిపారు. స్వచ్ఛతత్ రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు మోహన్ ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ వైద్యులు స్థానిక పాఠశాల ఆవరణలో వైద్య శిబిరం నిర్వహించారు. 64 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 26 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. రోగులకు ఉచిత భోజనం, రవాణా సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో హరీష్, అల్బన్స్, రాము, మురుగేష్ పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



సంక్షేమ లబ్ధిని చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం పోలి సచివాలయం పరిధిలోని పోలి హరిజనవాడ, భీమవరం పోలి ఎస్టీ కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దిష్టి తీశారు. ముందుగా పోలి గ్రామంలో నూతన సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. జగనన్న సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నా. అర్హత ఉన్నా అందని లబ్ధిదారులకు వెంటనే పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ పాలనతో పాటు రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రాములమ్మ, అశోక్‌రెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు, ప్రవీణ్, శ్రావణ్, గుణ, జనార్దన్, వెంకటరత్నం, సుధ, భాస్కర్‌యాదవ్, వెంకటసుబ్బారెడ్డి, సునీల్, గురవయ్యనాయుడు, చెన్నమ నాయుడు, శివ, చలపతి, బాలరాజు, రంజిత్, ప్రసాద్, సుధ, సాంబయ్య, శేఖర్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 30 మంది దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు మునీర్‌బాషా మాట్లాడుతూ.. పట్టణంలో పేద దివ్యాంగుల ఆర్థిక పరిస్థితిని గుర్తించి 138 నెలలుగా నిత్యావసర సరుకులను అందిస్తున్నామని తెలిపారు. వీరిలో ఆసక్తి కలిగిన వారికి చిరు వాపారాలు చేసుకునేందుకు సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు గరికపాటి రమేష్‌బాబు, కంఠా ఉదయ్‌కుమార్, బాబా ఫరీద్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



పాండూరు హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు

వరదయ్యపాళెం: మండలంలోని పాండూరు హైస్కూల్‌లో 1993–94 సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 30 ఏళ్ల తర్వాత వారందరూ కలుసుకోవడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమవంతు సాయం అందిస్తామని పేర్కొన్నారు. ఏ స్థాయిలో ఉన్నా అక్షరాలు నేర్పిన బడిని, గురువులను గుర్తించుకోవాలని అన్నారు. పూర్వ విద్యార్థులు శోభన్‌బాబు, వేణు, జ్యోతీశ్వరయ్య, వెంకట్రాయులు, సతీష్, జ్యోతి, రోజా, జయంతి, భాస్కర్, మధు, సుధాకర్, వినోద్ ఉన్నారు.

ఆగస్టు 7న జాతీయ ఓబీసీ మహాసభ



సమావేశంలో ఐక్యత చాటుతున్న ఏపీ బీసీ సంక్షేమ సంఘం నేతలు

తిరుపతి కల్చరల్: బీసీల అభ్యున్నతే లక్ష్యంగా ఆగస్టు 7వ తేదీన తిరుపతి నగరంలో భారీ స్థాయిలో జాతీయ ఓబీసీ మహాసభ నిర్వహించనున్నట్లు ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభ నిర్వహణపై వివిధ జిల్లాల నేతలతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ గతంలో బీపీ మండల్ కమిషన్ ఇచ్చిన నివేదికను అమలు చేయడంలో ప్రభుత్వాలు వివక్ష చూపాయని, దీంతో బీసీల బతుకులు మరింత దిగజారాయన్నారు.

దేశ వ్యాప్తంగా బడుగు, బలహీన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సుమారు 85 శాతం ఉన్నా అభివృద్ధి శూన్యమన్నారు. బీపీ మండల్ నివేదిక సమర్పించిన రోజైన ఆగస్టు 7వ తేదీన తిరుపతి నగరంలో నిర్వహించనున్న జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్‌కే.యాదవ్, నాయకులు వెంకటేశ్వర్లు, రఘుపతి, జ్ఞాన జగదీష్, బ్రహ్మానంద శర్మ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో విశాఖ మేయర్



ఆలయ ధ్వజస్తంభం వద్ద హరివెంకట కుమారి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం విశాఖపట్టణం మేయర్ హరివెంకట కుమారి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

పట్టర పట్టు హైలెస్సా..!



రోడ్డుపై ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం ఆర్టీసీ బస్సు ఆగిపోయింది. చేసేది లేక ప్రయాణికులు, పోలీసులు తోయడంతో స్టార్ట్ అయింది. ఇలా రోజూ ఏదో ఒక ప్రాంతంలో బస్సు ఆగిపోతుండడంతో ప్రయాణికులకు పాట్లు తప్పడం లేదు. ఇటీవల తిరుపతి నుంచి వస్తున్న బస్సు రేణిగుంట బైపాస్‌లో మొరాయించడంతో ప్రయాణికుల బాధలు వర్ణణాతీతం. ఇకనైనా అధికారులు స్పందించి కండిషన్‌లో ఉన్న బస్సులను మాత్రమే తిప్పాలని ప్రయాణికులు కోరుతున్నారు.

భార్యపై దాడి.. కేసు నమోదు

డక్కిలి: మాయ మాటలు చెప్పి తీసుకెళ్లి భార్యపై భర్త దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన డక్కిలి మండలం దగ్గవోలులో ఆదివారం జరిగింది. గూడూరు రూరల్ మండలం నెర్నూరు గొల్లపల్లె ఎస్టీ కాలనీకి చెందిన బండి విజయమ్మ అలియాస్ శాంతమ్మ, చెంచురత్నం దంపతుల మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. చెంచురత్నం ఆమెను వదలి సైదాపురం మండలం పాలూరులో నివాసం ఉంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం విజయమ్మ వద్దకు వచ్చి మాయ మాటలు చెప్పి డక్కిలి మండలం దగ్గవోలు సబ్‌స్టేషన్ వద్దకు తీసుకెళ్లి, దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అనంతరం దగ్గవోలు ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఉన్న ముళ్ల పొదల్లో వేసి వెళ్లాడు. మూలుగుతున్న శబ్దం వినిపించడంతో స్థానికులు అక్కడికి వెళ్లి ఆమెను గుర్తించారు. పోలీసులకు సమాచారం అందజేశారు. గాయపడిన మహిళను వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డక్కిలి ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జశ్విన్‌రెడ్డి ప్రతిభ



తల్లిదండ్రులతో జశ్విన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీకాళహస్తి విద్యార్థి మాండవ్యపురం జశ్విన్‌రెడ్డి ప్రతిభ చూపాడు. జాతీయ స్థాయిలో 1,376వ ర్యాంకు సాధించాడు. అదే విధంగా కేటగిరిలో 124వ స్థానంలో నిలిచాడు. జశ్విన్‌రెడ్డి శ్రీకాళహస్తి పట్టణం శ్రీరామ్‌నగర్‌కాలనీకి చెందిన జయభారత్‌రెడ్డి, సురేఖ దంపతుల కుమారుడు. జశ్విన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఐఐటీ మద్రాస్‌లో కంప్యూటర్ సైన్స్ లేదా ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదవాలని ఉందన్నారు. జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించిన జశ్విన్‌రెడ్డిని పలువురు అభినందించారు. కాగా గత నెల విడుదలైన జేఈఈ మెయిన్స్ 99.96 పర్సంటైల్‌తో ఆల్‌ఇండియా 494వ ర్యాంకు సాధించాడు. ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 225వ ర్యాంకు సాధించిన విషయం తెలిసిందే.

విస్తారంగా సజ్జ పంట సాగు



గాజుల పెళ్లూరులో సాగులో ఉన్న సజ్జ పంట

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు, ఆలత్తూరు, నీర్పాకోట, వెస్టువరత్తూరు, కనమనంబేడు, జీఎన్‌కండ్రిగ, కాంపాళెం గ్రామల్లోని రైతులు సజ్జ పంటను విస్తారంగా సాగు చేస్తున్నారు. సుమారు 300 ఎకరాల్లో సజ్జ పంట వేశారు. ఆరుతడి పంట కావడంతో రైతులు మెట్ట భూముల్లో పంటను ఎక్కువగా వేస్తున్నారు. సజ్జ పంటకు మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో ఎకరాకు అన్ని ఖర్చులు పోను రూ. 25 వేలు మిగులుతోంది. ప్రభుత్వం సబ్సిడీపై సజ్జ పంటకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులను పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

క్వారీ.. వర్రీ




సేలం ఇండ్లు గ్రామంలో బీటలు వారిన ప్రహరీ



ఇంటి ముందు పడిన రాయి

వరదయ్యపాళెం: మండలంలోని మరదవాడ సమీపంలో ఉన్న ఎస్ఎస్‌పీఆర్ క్వారీతో సేలం ఇండ్లు వాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. క్వారీ బ్లాస్టింగ్‌లతో నిత్యం భయభ్రాంతులకు గురవుతున్నట్లు వాపోతున్నారు. క్వారీ పేలుళ్ల ధాటికి ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయి. బండరాళ్లు ఎగిరి పడుతుండడంతో ఏ సమయంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితిలో ఉన్నామని స్థానికులు చెబుతున్నారు. కనీస భద్రతా చర్యలు చేపట్టకుండా ఇళ్ల సమీపంలో క్వారీకి ఎలా అనుమతి ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

నయనానందకరం.. నాటకాభినయం



తిరుపతి కల్చరల్: మహతి కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి కోనేటి సుబ్బరాజు నాట్య కళాపరిషత్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన పౌరాణిక, సాంఘిక నాటికలు నయనానందకరంగా సాగాయి. కోనేటి సుబ్బరాజు సోదరుడు, టీటీడీ ఏఈవో దుర్గరాజు వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో పిఠాపురం స్నేహాంజలి ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన »చింత చచ్చినా« సాంఘిక నాటిక కనుమరుగుతున్న మనుషుల బాంధవ్యాలను ఆవిష్కరిస్తూ వాటిని పరిరక్షించుకున్నప్పేవడే కుటుంబ వ్యవస్థ పురోభివృద్ధి చెందడంతోపాటు సమాజ శ్రేయస్సుకు ఎలా ఉపయోగపడుతుందో తెలియజేసింది. తిరుపతి కళాకారులు ప్రదర్శించిన శ్రీకృష్ణ రాయభారం పౌరాణిక పద్యనాటకంలో పాండవుల లక్క ఇల్లు దగ్ధం నుంచి కృష్ణుడి రాయభారం వరకు చక్కటి సన్నివేశాలతో అద్భుత సెట్టింగ్స్ మధ్య నాటకాన్ని రక్తి కట్టించారు. అనంతరం నిర్వహించిన సభా కార్యక్రమానికి టీటీడీ ట్రాన్స్‌పోర్ట్ సీఈవో పీవీ.శేషారెడ్డి, చీఫ్ ఆడిట్ శేషశైలేంద్ర, అన్నదానం స్పెషల్ ఆఫీసర్ జీఎల్ఎన్.శాస్త్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, బ్లిస్ హోటల్ అధినేత మబ్బు సూర్యనారాయణరెడ్డి అతిథులుగా హాజరై నాటక కళా వైభవాన్ని కొనియాడారు. కోనేటి సుబ్బరాజు నాటక కళా రంగానికి చేస్తున్న కృషిని అభినందించారు. ఈ సందర్భంగా కళాకారులను, అతిథులను నిర్వాహకుడు కోనేటి సుబ్బరాజు శాలువలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు.